క్లుప్తంగా

దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెంలోని శ్రీ కోదండరామచంద్రస్వామి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం గ్రామంలో ధ్వజస్తంభం, దేవతామూర్తుల విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల మధ్య జలధివాస కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

సుబ్లేడు శివాలయంలో ఎమ్మెల్యే కందాల పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మండలంలోని కొక్కిరేణి పరిధిలో కోల్డ్ స్టోరేజీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, సుబ్లేడు ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపని సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో మాన్వికి రాష్ట్ర స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న మాన్వి

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమత ఆస్పత్రిలోని డెంటల్ కాలేజ్ ప్రిన్సిపాల్ జి.వెంకటేశ్వరరావు–అనిత దంపతుల కుమార్తె మాన్విశని, ఆదివారాల్లో సికింద్రాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రతిభ చాటింది. విజయ మాధవి సేవా సంస్కృతిక అకాడమీ ఆధ్వర్యాన నిర్వహించిన ఆదియోగి మహోత్సవంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి అవార్డుని సొంతం చేసుకుంది. ఈమేరకు మాన్విని పలువురు అభినందించారు.

పొంగులేటి పర్యటన



వివాహ వేడుకకు హాజరైన పొంగులేటి

ఖమ్మంరూరల్: మండలంలోని శ్రీరాంనగర్‌కు చెందిన గుండా మధుకర్‌రెడ్డి, వసంతలక్ష్మి దంపతుల కుమారుడు, కోడలు అభిలాష్‌రెడ్డి, వెంకటరమ్యశ్రీ నూతన దంపతులను మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఆశీర్వదించారు. అదేవిధంగా సత్యనారాయణపురంలోని ఓ ఫంక్షన్‌హాల్లో జరిగిన రిసెప్షన్‌లో పాల్గొన్న నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో గుండా విజయభాస్కర్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	వినరో భాగ్యం విష్ణు కథ
సాయిరాం	కోనసీమ తగ్స్
ఆదిత్య	సెల్ఫీ
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	మిరపకాయ్

– ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	66	పాలకూర	6
పచ్చిమిర్చి	22		20
కాకర	38	చుక్కకూర	6
బోడ కాకర	40		20
బీర	46	తోటకూర	6
దొండ	26		20
పొట్లకాయ	36	గోంగూర	6
చిక్కుడు	30		20
గోరుచిక్కుడు	36	మెంతికూర	3
క్యాబేజీ	14		20
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	18		15
కీరదోస	26	పుదీన	1
క్యారెట్	18		15
బీట్‌రూట్	22	–ఖమ్మం వ్యవసాయం	

చేపల చెరువులో.. రాజకీయ గాలం!

చెరువుమాధారం చెరువులో అంతుచిక్కని సమస్యలు

- మూడేళ్లుగా పాలకవర్గానికి జరగని ఎన్నికలు
- ఆక్రమణలో చెరువు శిఖం
- రెండేళ్లుగా సాగని చేపల వేట..
- విస్తీర్ణానికి, సొసైటీ సభ్యులకు పొంతన లేక సతమతం



చెరువులో రొయ్యలు వదులుతున్న అధికారి ఆంజనేయస్వామి(ఫైల్)



చెరువుమాధారం చెరువు

చేపలను పెంచి.. విక్రయాలు చేపట్టి.. జీవనోపాధిగా ఉన్న చెరువు గత మూడేళ్లుగా పాలకవర్గం ఎన్నికలు లేక, చేపల వేట సాగక మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారు. జిల్లాలోనే అతి పెద్ద చెరువుగా పేరున్న చెరువుమాధారం చెరువుపై రాజకీయ జోక్యం ఉండటంతో ఇటు ఎన్నికలు జరుగక, అటు చేపల వేట లేకపోవటంతో పాటు చెరువు విస్తీర్ణం ఆక్రమణకు గురవుతోంది. సభ్యుల్లో రెండు వర్గాలుగా చీలడంతో విస్తీర్ణంతో పాటు సభ్యుల సంఖ్యకు పొంతన లేకుండా పోయింది. దీంతో ఇటు సొసైటీకి, అటు అధికారులకు తలనొప్పిగా మారింది.

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు జిల్లాలోనే అతిపెద్ద చెరువుగా దాదాపు 518 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇందులో మంగాపురంతండా, రాజారాంపేట, రాయగూడెం, చెరువుమాధారం పంచాయతీలకు చెందిన సభ్యులు ఉన్నారు. తొలుత 518 మంది సభ్యులు ఉన్నారు. సొసైటీకి పాలకులు వచ్చిన సందర్భాల్లో కొత్త సభ్యులను పోటాపోటీగా చేర్పించేవారు. తాజాగా 1,070 మంది సభ్యులు ఉన్నారు. అయితే విస్తీర్ణం కంటే రెట్టింపు సభ్యులు ఉండటంతో పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదుల పరంపరం కొనసాగుతోంది.

ఎన్నికలు జరిగి మూడేళ్లు..

చెరువుమాధారం చెరువుకు 2020లో పాలకవర్గం గడువు పూర్తయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికలు జరగకుండా, ప్రత్యర్థుల మోకాలాడుతున్నారు. గతంలో అర్హత పరీక్షలు నిర్వహించకుండా, సభ్యత్వాల పేరిట ఒక్కో సభ్యుడి దగ్గర కొంత మంది డబ్బులు తీసుకుని సభ్యత్వం ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు జరగాలని ఒక వర్గం కోరగా.. సభ్యుల సంఖ్య తేలిన తర్వాతే జరగాలని మరో వర్గం పట్టుబట్టింది. దీంతో ఇరువర్గాల నేపథ్యంలో ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి.

ఆక్రమణలో చెరువు విస్తీర్ణం..

చెరువుమాధారం చెరువు విస్తీర్ణంలో సంబంధిత శాఖల అధికారులు లెక్కలకు పొంతన లేకుండా ఉంది. 518 ఎకరాల చెరువు అని అధికారులు, కాదని 800 వరకు ఉంటుందని పాలకులు చెబుతున్నారు. చెరువు విస్తీర్ణాన్ని తేల్చాల్సిన ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారుల మధ్య సమన్వయం లేక లెక్కలు కుదరటం లేదు. ఇదిలా ఉండగా.. మరో పక్క చెరువు చుట్టూ మంగాపురం, చిన్నతండా, బైరవునిపల్లి, చెరువుమాదారం గ్రామాల్లో పలువురు చెరువు శిఖంను ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. కానీ ఆ దిశగా ఏ అధికారి కూడా పట్టించుకోవటం లేదు.

విచారణ చేపట్టాలి..



చెరువుమాధారం మత్స్య సొసైటీ సభ్యుల సంఖ్య తేల్చాలి. లేకుంటే కోర్టును ఆశ్రయిస్తాను. అంత వరకు చేపల వేట కొనసాగించడానికి వీలు లేదు. అధికారులు బైలా ప్రకారం చర్యలు తీసుకోవాలి. కొంతమంది డబ్బులు తీసుకుని సభ్యులను చేర్పించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలి.

– కోట్యానాయక్, మంగాపురంతండా, సభ్యుడు

త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తాం..



చెరువుమాదారం సొసైటీకి త్వరలోనే ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు సభ్యుల వివరాలు ప్రకటించి ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తాం. చెరువుమాధారం మత్స్య సొసైటీ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. ఆర్డర్ ప్రకారం ముందుకు సాగుతాం.

– ఆంజనేయస్వామి, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఖమ్మం

ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు..

ఇరువర్గాల మధ్య పోరుతో చెరువుమాధారం సభ్యులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత రెండేళ్ల నుంచి చేపల వేట సాగకపోవటంతో ఉపాధి కోల్పోయారు. వర్షాకాలంలో పలుమార్లు వరదలు వచ్చి చేపలు టన్నుల కొద్ది కొట్టుకుపోయిన ఘటనలూ ఉన్నాయి. అంతేకాక చేప సైజ్ పెరిగి, వివిధ కారణాల వల్ల చేపలు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని చెరువుమాధారం చెరువుపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

‘ఎస్‌బీఐటీ’లో ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థినులతో చైర్మన్ కృష్ణ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యాన గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న మహేంద్ర ప్రైడ్ శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసినట్లు కళాశాల చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎంబీఏ విద్యార్థులకు కంపెనీలు చాలా అవకాశాలు కల్పిస్తున్నందునా వారికి సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, రెజ్యూమ్ ప్రిపరేషన్, లీడర్ షిప్ క్వాలిటీస్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ కిట్ల పంపిణీ

ఖమ్మంఅర్బన్: జిల్లాలో ఇంటింటికీ టీడీపీ కిట్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు కూరపాటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, గుత్త సీతయ్య మాట్లాడుతూ.. ఇంటింటికీ టీడీపీ కిట్లను ఖమ్మం పార్లమెంటు పరిధిలోని మండల పార్టీ కన్వీనర్లకు అందజేస్తున్న తెలిపారు.అనంతరం పార్టీ మండల నాయకులు పలు ఇళ్లకు వెళ్లి కిట్లను అందించారు.

‘మహిళలకు రక్షణ కరువైంది’



మాట్లాడుతున్న మాజీ మంత్రి రవీంద్ర నాయక్

ఖమ్మం మామిళ్లగూడెం: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మహిళలకు రక్షణలేక అత్యాచారాలు పెరిగిపోయాయని, రైతుల ఆత్మహత్యలు కూడా పెరిగాయని మాజీ మంత్రి రవీంద్రనాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహిళలపై దాడులు, వేదింపులు అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. తెలంగాణలో అమరవీరుల కుటుంబాలను గాలికొదిలేశారని అన్నారు. కాకతీయ మెడికల్ కళాశాలలో గిరిజన విద్యార్థిని ధరావత్ ప్రీతికి సరైన న్యాయం చేయాలని, గిరిజన బిడ్డలపై జరుగుతున్న దాడులను ఎందుకు ఖండించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. బీజేపీ ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ పేరుతో ప్రజలకు మరింత చేరువ అవుతున్నట్లు తెలిపారు. ఖమ్మం మిర్చి మార్కెట్‌లో రైతులను నిలువు దోపిడీ చేస్తుంటే చర్యలు తీసుకోవటం లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రుద్రప్రదీప్, శ్యామ్‌రాథోడ్, ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, డీకొండ శ్యామ్, శ్రీనివాస్, భద్రం, అంకిత పాపారావు, విక్రం జాదవ్, అంజన్న, పసుమర్తి సతీష్, కృష్ణ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు రాజబాటలు

రూ.2 కోట్ల నిధులతో కొనసాగుతున్న డొంక రోడ్ల నిర్మాణ పనులు



డొంక రోడ్డుపై నడుస్తున్న హరియాతండావాసులు

రఘునాథపాలెం: ఇప్పటి వరకు గ్రామాల్లో రహదార్లుకే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చిన పాలకులు.. ఇక పంటపొలాలకు సైతం రైతులు ఎలాంటి ఇబ్బంది పడకుండా రాకపోకలు సాగించడానికి అనువుగా డొంక రోడ్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. మండలంలోని డొంక రోడ్ల అభివృద్ధి కోసం మంత్రి అజయ్‌కుమార్ రూ.2 కోట్లు మంజూరు చేయించారు. మండల వ్యాప్తంగా ప్రధాన రోడ్లు అన్ని ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దగా.. డొంక రోడ్ల నిర్మాణ పనులకు శరవేగంగా సాగుతున్నప్పటికీ.. కొన్ని గ్రామాల్లో పూర్తి కావొచ్చాయి. ఈ సందర్భంగా మండల ప్రజానీకం, రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. మండలంలోని హరియాతండా డొంక రోడ్డుపై నడుస్తూ రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్లీనరీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



ప్లీనరీలో జిల్లా కాంగ్రెస్ నాయకులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంరూరల్: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న పార్టీ 85వ ప్లీనరీలో ఆదివారం సైతం జిల్లా పార్టీ నాయకులు పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి, నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం, నారాయణరావు, రాందాస్, సున్నం నాగమణి, భాస్కర్ గౌడ్, సైదులు, నాగండ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం విద్యారంగంపై చవితి తల్లి ప్రేమ చూపిస్తుందని, రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లవుతున్నా.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం లేదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉపేందర్, మస్తాన్‌లు అన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో జరిగిన సంఘ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం వాటిల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. గురుకులాల్లో సన్న బియ్యం భోజనం పెట్టడం లేదని, ఫుడ్ పాయిజన్‌లు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. కనీస మౌలిక వసతులు లేకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలకు అన్ని వసతులతో సొంత భవనాలు నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న విద్యార్థి ఫీజు, ఉపకారవేతనాల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు సాగర్, పండు, ఆర్కే, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలల కథల కవితల పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ, తదితరులు

ఖమ్మం గాంధీచౌక్: నగరంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో ఆదివారం జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు రాసిన కథలతో ‘ఖమ్మం జిల్లా కథల పల్లకి’కవితలతో ‘సుగంధి’పుస్తకాలు రూపుదిద్దుకోగా జిల్లా విద్యాశాఖ అధికారి ఈ. సోమశేఖరశర్మ, మువ్వా శ్రీనివాసరావులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాలో విద్యార్థులు సృజనాత్మక రంగాల్లో ముందుకు దూసుకెళ్తున్నారన్నారు. సాహిత్యంలో వివిధ ప్రక్రియలో రచనలు చేయడం, ఉపాధ్యాయులు ఆ దిశగా చేస్తున్న కృషికి అభినందనీయమని తెలిపారు. పుస్తకాలకు ఆర్థిక సహకారం అందించిన యలమద్ది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పిల్లలు రాసే పుస్తకాల ముద్రణ అవకాశం తనకు రావటం అదృష్టంగా భావిస్తున్నానని, రానున్న రోజుల్లోనూ నా వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. స్వర్ణ భారతి కమ్మ వారి కళ్యాణమండపం అధ్యక్షులు ఎర్నేని రామారావు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సాహిత్య కార్యక్రమాలకు తన మండపాన్ని ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పుస్తకాల సంపాదకులు బాలసాహితీ వేత్త సయ్యద్ షఫీ అధ్యక్షత వహించగా ప్రత్యేక ఆహ్వానితులుగా బాల కవులు ఎస్‌కె. రిజ్వాన, ఎలగాల పావని, మేడగాని శేషగిరి ఎం. మనోరమ, సుచరిత, ఎం జ్యోతి, జీడీఎస్వీ రమణ, ఉరిమళ్ళ సునంద, కన్నెగంటి వెంకటయ్య, వై. దేవయ్య, కె.కృష్ణయ్య, పి.సీతారామారావు, ఎస్.వెంకటేశ్వర్లు, బ్రహ్మం, జి.గోపాలకృష్ణ, సుగంధి పుస్తక ప్రచురణకర్త బోళ్ళ బ్రహ్మం పాల్గొన్నారు.

ఆగ్రహి పుస్తకావిష్కరణ..



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

ఖమ్మం గాంధీచౌక్: ఎన్నెస్పీ కాలనీలోని టెండర్ రూట్స్ పాఠశాలలో ఆగ్రహి పుస్తకావిష్కరణ కార్యక్రమం కేంద్ర సాహిత్య అకాడమీ కేంద్ర కమిటీ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంది అవార్డు గ్రహీత, ప్రముఖ నాటక రచయిత తాటికొండాల నరసింహారావు హాజరై పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం మువ్వా శ్రీనివాసరావు, పి.రవిమారుత్, పుప్పాల శ్రీరామ్, కన్నోజు ఫణి, మాధవి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కవులు రచయితలు సాహితీవేత్తలు అనిల్ డ్యాని, వంశీకష్ణ, అట్లూరి వెంకటరమణ, వురిమళ్ళ సునంద,జయశ్రీ మువ్వా, రూపా రుక్మిణి, వీ.ఎస్.రావు పాల్గొన్నారు.

‘ఈ గవర్నెన్స్’పై అవగాహన..



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: చిన్నతనం నుండే విద్యార్థులు సాంకేతికతపై అవగాహన పెంపొందించుకోవాలని సీసీఎస్ కానిస్టేబుల్ పి.నరసింహారావు అన్నారు. ఆదివారం నగరంలోని ఎన్నెస్పీ క్యాంపులో గల ఎస్సీ బాలుర వసతి గృహ సముదాయంలో చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, డిజిటల్ లిటరసీ (ఈ గవర్నెన్స్)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ.. విద్యార్థులు బయట వ్యక్తులతో జాగ్రత్తగా మెలుగుతూ.. మారుతున్న సాంకేతికత వలన చెడు ప్రభావం పడకుండా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అవసరమైన దాని కోసమే సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ మెంబర్ జి.నరేందర్, వసతిగృహ సంక్షేమ అధికారులు కె.రుక్మారావు, ఎ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి



మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మం సహకారనగర్: హౌస్ బిల్డింగ్ సొసైటీ ఇళ్ల స్థలాల అంశాన్ని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి సొసైటీ సభ్యులకు ఇళ్లస్థలాలు వచ్చేలా కృషి చేస్తామని కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌లు పేర్కొన్నారు. ఎండీ సలీం అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఖమ్మం జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల మ్యూచువల్ ఎయిడెడ్ హౌజ్ బిల్డింగ్ కో ఆపరేటివ్ సొసైటీ, ఖమ్మం జిల్లా మహాజన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ హకీమ్, ముఖ్య సలహాదారులు కె.కోటేశ్వరరావు, సొసైటీ ఉపాధ్యక్షులు వేణుగోపాల్, నాయకులు టి.పంతులు, వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాబురావు, జి.రాములు, బి.రామారావు, నరసింహారావు, అజీముద్దీన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ వనమా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం.. ఆడిపాడిన స్నేహగణం



గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నేలకొండపల్లి: బాల్యం మరవలేని జ్ఞాపకం.. వృత్తి, ఉద్యోగ, వ్యాపార రీత్యా ఏ స్థాయిలో ఉన్న చిన్ననాటి మిత్రులు కనిపిస్తే తెలియకుండానే చిన్న పిల్లలం అయిపోతాం. బడిలో చేసిన చిలిపి చేష్టలు.. అల్లరి పనులు తలచుకుంటూ ఆనందంలో మునిగితేలారు. ఆదివారం మండలంలోని రాజేశ్వరపురం ఉన్నత పాఠశాల మైదానంలో అడుగడుగునా అలాంటి జ్ఞాపకాల చిత్రాలు కనిపించాయి. రాజేశ్వరపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి(1986–87 బ్యాచ్)కి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరూ ఒక వేదికపై కలుసుకొని సందడి చేశారు. బాల్య స్మృతులను గుర్తు చేసుకుని ఆటల, పాటలతో సందడి చేశారు. అనంతరం ఆత్మీయ విందు ఆరగించారు. ఈ కార్యక్రమంలో అడపాల రామారావు, ఇస్లావత్ బాలాజీ, సత్యనారాయణరెడ్డి, త్రిలోకి, సత్యవతి, జ్యోతి, వేణు, కిషోర్, వెంకటేశ్వర్లు, రాజేశ్వరపురం పంచాయతీ సర్పంచ్ దండా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని దోచుకునేందుకే బీఆర్‌ఎస్ ఎత్తుగడ



మాట్లాడుతున్న నున్నా రవికుమార్

నేలకొండపల్లి: తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ కోసం ప్రతి ఒక్కరూ ఆదరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ కోరారు. ఆదివారం నేలకొండపల్లిలో నిర్వహించిన ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబం అధికారాన్ని అడ్డుపెట్టుకుని సంపద మొత్తాన్ని దోచుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. బీఆర్‌ఎస్ పేరుతో దేశాన్ని దోచుకునేందుకు కేసీఆర్ ఎత్తుగడ వేసినట్లు ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం, విద్యుత్ అందుతాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే అది కేవలం ఒక్క బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు చావా కిరణ్, పార్టీ మండల అధ్యక్షుడు మన్నె కృష్ణారావు, కోటి హనుమంతరావు, మీగడ గోపి, కాళంగి వెంకటేశ్వర్లు, సూరేపల్లి జ్ఞానరత్నం, రామకృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.